సాక్షి
కామారెడ్డి
బుధవారం, 11, అక్టోబర్, 2023



బియ్యం కోసం ఆందోళన

రేషన్ బియ్యం కోసం పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామస్తులు సర్పంచ్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు.

-11లో ▸



బలోపేతం చేయాలి

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు సూచించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
36.5 /19.4

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ నేతపై సస్పెన్షన్ వేటు

సాక్షి, కామారెడ్డి: బీబీపేట మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దేవునిపల్లి శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు క్రియాశీల సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేయడం, పార్టీ అభివృద్ధిని విస్మరిస్తున్నందున క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. దళితబంధు యూనిట్ మంజూరు కావాలంటే రూ. 2 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని, ఆ డబ్బులు అధికారులు, నాయకులకు ఇస్తేనే పని అవుతుందని ఇటీవల బీబీపేట మండలానికి చెందిన నేత మాట్లాడిన ఆడియో టేపు వైరల్ అయ్యింది. ఇది రాజకీయ విమర్శలకు దారి తీయడంతో బీఆర్‌ఎస్ దిద్దుబాటు చర్యలు చేపట్టి, పార్టీనుంచి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

'పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి'



నిజాంసాగర్: ఎన్నికల నియమావళి తప్పనిసరిగా అమలయ్యేలా చూడాలని జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం నిజాంసాగర్ మండల పరిషత్‌లో జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల సెక్టార్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కరంట్, తాగునీరు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, ఫర్నిచర్, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన చౌరస్తాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, గోడ రాతలు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వృద్ధులు ఇళ్లవద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీలకు చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. పట్టణంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి, 9వ తరగతి చదువుతున్న వారిద్దరూ పరీక్షలు రాసేందుకు పాఠశాలకు వెళ్తున్నామని ఇళ్లలో చెప్పి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వారి ఆచూకీని గుర్తించేందుకు ప్రయత్నించారు. ఒకరి ఆచూకీ లభించినట్లు తెలిసింది. బాలికల అదృశ్యానికి కారణాలు తెలియరాలేదు.

వరికోతలు ప్రారంభం



నాగిరెడ్డిపేట: ఈ ఏడాది వానాకాలంలో సాగుచేసిన వరిపంట కోతకొచ్చింది. ముందస్తుగా వరినాట్లు వేసిన ప్రాంతాలలో కోతలు కూడా ప్రారంభమయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలోని పలుగ్రామాలలో రైతులు వరికోత యంత్రాలతో పంటనూర్పిడి చేయిస్తున్నారు. నూర్పిళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించటానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమోకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

14న ఉర్దూ కవి సమ్మేళనం

బిచ్కుంద: మండల కేంద్రంలోని దర్గా చౌరస్తాలో ఉన్న దారుల్ ఉలూమ్ మదర్సాలో ఈనెల 14న ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు మౌలానా రిజ్వాన్ ఖాస్మీ తెలిపారు. మంగళవారం కవి సమ్మేళన కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా 14న రాత్రి 9 గంటలకు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గులాబీదళంలో కదలిక



- కేటీఆర్ దిశానిర్దేశంతో..
- విభేదాలను పక్కన పెట్టిన నేతలు
- బూత్ కమిటీల ఏర్పాటుపై కసరత్తు
- వంద మంది ఓటర్లకో ఇన్‌చార్జి ఉండేలా ప్రణాళిక

బీఆర్‌ఎస్ నేతల్లో కదలిక వచ్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో కామారెడ్డి నియోజకవర్గంలో బూత్ కమిటీల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించారు. వంద మంది ఓటర్లకో ఇన్‌చార్జిని నియమించి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

సాక్షి, కామారెడ్డి: "ఉద్యమకారుడే ఉత్తమ పాలకుడైన వేళ కామారెడ్డి సరికొత్త చరిత్రకు వేదిక కాబోతుంది. నెర్రెలు బారిన ఈ నేల సస్యశామలం కావాలన్న సదాశయంతో వస్తున్న సీఎం కేసీఆర్‌ను రికార్డు మెజారిటీతో గెలిపించేందుకు విభేదాలను పక్కన పెట్టండి. బూత్ కమిటీలను ఏర్పాటు చేసి ఇంటింటికీ కేసీఆర్ సందేశం తీసుకువెళ్లాలి. ఈ ప్రభుత్వంతో ప్రజలకు జరిగిన మేలును గుర్తు చేయాలి" అని ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి కేటీఆర్ పార్టీ నాయకులకు సూచించారు. నేతల మధ్య నెలకొన్న విభేదాలపై స్పందించిన మంత్రి.. వారికి చురకలంటించారు. పార్టీ కార్యక్రమాలపై నిత్యం సమీక్షిస్తానని కేటీఆర్ పేర్కొనడంతో నియోజకవర్గంలోని పార్టీ నేతల్లో కదలిక వచ్చింది. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. కేటీఆర్ నిర్దేశించిన పద్ధతుల్లో బూత్ కమిటీల ఏర్పాటు, వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కలసికట్టుగా..

బీఆర్‌ఎస్ ముఖ్య నేతలంతా ఒక్కచోటుకు చేరుకుని బూత్ కమిటీల ఏర్పాటుపై చర్చించినట్టు తెలుస్తోంది. సమావేశంలో బూత్‌లవారీగా చర్చించి కమిటీలపై కసరత్తు చేశారు. ఒకటి రెండు రోజుల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. అనంతరం కమిటీల ఆధ్వర్యంలో ప్రజలను కలుస్తారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు ఆయా పథకాల లబ్ధిపొందిన వారికి సీఎం కేసీఆర్ రాసిన లేఖలను అందిస్తారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సభలకు జనసమీకరణ బాధ్యతనూ ఈ కమిటీలే చూసుకోవాల్సి ఉంటుంది.

మరింత క్రియాశీలకంగా పనిచేసేలా..

ఇన్నాళ్లూ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో జనంలో ఉన్న నేతలంతా మరింత క్రియాశీలకంగా పనిచేసేందుకు నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నేతలందరినీ సమన్వయం చేస్తూ వారికి దిశానిర్దేశం చేయనున్నారు. మంత్రి కేటీఆర్ నిత్యం పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడతానని చెప్పడంతో అందరూ యాక్టివ్‌గా ఉండాలని, అడిగిన వాటికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

ఫామ్‌హౌస్‌లో సమావేశం..

కామారెడ్డికి సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో మంగళవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని మొత్తం 266 పోలింగ్ బూత్‌ల గురించి చర్చించారు. ఆయా బూత్‌ల పరిధిలో నేతల పేర్లతో జాబితాలను రూపొందించారు. ప్రతి బూత్‌కు పది మందిని బాధ్యులుగా నియమించే విషయమై చర్చించారు. మొదట ఒక్కో బూత్‌కు ముఖ్యమైన ఇద్దరు నేతల పేర్లతో జాబితా తయారు చేశారు. ఆ ఇద్దరు కలిసి మరో ఎనిమిది మంది పేర్లను నమోదు చేసి పది మందితో బూత్ కమిటీని పటిష్టం చేయాలని నిర్ణయించారు. ఈ పది మందిలో ఒకరు బూత్ కమిటీని లీడ్ చేస్తారు. ఎమ్మెల్యేతోపాటు ఆయా గ్రామాలు, పట్టణంలోని వార్డులకు చెందిన ముఖ్య నేతలందరూ కమిటీల్లో ఉంటారు. ఎన్నికలు పూర్తయ్యేదాకా ఈ బూత్ కమిటీలు పనిచేస్తాయి. ఓటర్ల వద్దకు ఒకటికి పదిసార్లు వెళ్లి, వారికి ప్రభుత్వం చేసిన మేలు గురించి అవగాహన కల్పించనున్నారు. వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడం ద్వారా ప్రతి ఓటు కారుకు పడేలా చూసేందుకు నేతలు ప్రణాళిక రూపొందించారు.

కేసీఆర్ పర్యటన ఖరారు

- ఈనెల 30న జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో సభలు
- వచ్చే నెల 9న కామారెడ్డిలో నామినేషన్, బహిరంగ సభ



సాక్షి, కామారెడ్డి: భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) పార్టీ అభ్యర్థుల ఎంపికతో పాటు ప్రచారంలోనూ దూసుకుపోతోంది. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్.. బీ ఫామ్‌లు ఇవ్వడానికి ఈనెల 15న ప్రత్యేక సమావేశం నిర్వహించబోతోంది. ఆ మరుసటి రోజు నుంచే బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ జిల్లాల పర్యటన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్ విడుదలైంది. ఒక్కోరోజు రెండు, మూడు నియోజకవర్గాలను చుట్టేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈనెల 30న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు జుక్కల్ నియోజకవర్గంలో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ పాల్గొంటారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పొరుగునే ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలోనూ ప్రసంగిస్తారు. వచ్చే నెల 9న కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేయడానికి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. నామినేషన్ అనంతరం అదేరోజు సాయంత్రం జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేశారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు కలిపి కామారెడ్డి పట్టణంలో సభ నిర్వహించనున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థులు, పార్టీ నేతలు ప్రచారానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ పర్యటనలతో మరింత ఊపు వస్తుందని భావిస్తున్నారు. మొదటి విడత అయిపోయిన తర్వాత రెండో విడతలో మరోసారి కేసీఆర్ పర్యటనలు ఉంటాయని భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు సైతం జిల్లాలో పర్యటించే అవకాశాలున్నాయి.

104 ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: డిమాండ్లను పరిష్కరించాలంటూ 104 ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. మంగళవారం సీఐటీయూ, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్‌ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని సమ్మె శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ 104 ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీనివాస్, సంతోష్, స్వామి, భరత్, శేషగిరి, సాయిబాబా, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు షురూ..

- బెల్టు షాప్‌లపై ఎక్సైజ్ దాడులు
- ముమ్మరంగా వాహనాల చెకింగ్



టేక్రియాల్ వద్ద తనిఖీ చేస్తున్న దేవునిపల్లి పోలీసులు

కామారెడ్డి క్రైం: అసెంబ్లీ ఎలక్షన్స్ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో ఎక్సైజ్, పోలీస్ శాఖలు అప్రమత్తమయ్యాయి. తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడానికి నేతలు డబ్బు, మద్యం పంపిణీ చేస్తుంటారు. దీనిని అడ్డుకోవడానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్రమంగా నిల్వ చేసిన మద్యంతోపాటు లెక్క చూపకుండా తరలిస్తున్న నగదును పట్టుకుంటున్నారు. మంగళవారం పలుచోట్ల పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా, ఎక్సైజ్ అధికారులు బెల్టు షాప్‌లపై దాడులు చేశారు.

రూ. 5.21 లక్షలు పట్టివేత..

కామారెడ్డి బల్దియా పరిధిలోని టేక్రియాల్ చౌరస్తా వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు ఓ కారులో రూ. 5,21,160 లను గుర్తించారు. నిజామాబాద్ వైపు నుంచి ఓ వ్యక్తి తన కారులో కామారెడ్డికి నగదును తీసుకువస్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. నగదుపై ఎన్నికల అధికారులు విచారణ జరపనున్నారు.

ఎక్సైజ్ అధికారులు తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని బెల్టు షాప్‌పై దాడి చేసి రూ.43 వేల విలువైన బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్, శివాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై మంగళవారం సాయంత్రం దాడులు చేసి, రూ.15 వేల విలువ చేసే బీరుసీసాలు ఇతర మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలలో స్టాక్ నిల్వలు తెలుసుకున్నారు. తప్పుడు మార్గంలో మద్యం సరఫరా జరగకుండా ఉండేందుకు, నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు రోజువారీగా స్టాక్ వివరాలను సేకరించడం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

అక్రమ రవాణాను అడ్డుకునేందుకు..

సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. నగదు, మద్యం అక్రమ రవాణాలను అరికట్టడం కోసం క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



నాయకులతో కలిసి ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ రానుందన్నారు. 10 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారని పేర్కొన్నారు. 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటాయన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకునేవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నామినేషన్ల స్వీకరణకు 10 రోజుల ముందు వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తుది ఓటరు జాబితాలో ఎవరిదైనా ఓటు లేకపోతే సంబంధిత బూత్ లెవల్ ఎలక్టోరల్ ఏజెంట్ ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, సీ విజిల్, 1950 నంబర్, ఎన్జీఆర్‌ఎస్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తామని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సువిధ కేంద్రం ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా వచ్చి ఎన్నికల ప్రచారం, ర్యాలీలు, బహిరంగ సభలు, తదితర కార్యక్రమాల అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆయా అనుమతుల కోసం 48 గంటల ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా ప్రవర్తిస్తే సీవిజిల్ అప్లికేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. 100 నిమిషాల్లో ఫిర్యాదును పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, పారదర్శకంగా ఎన్నికలు జరిపేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలను ప్రలోభపెట్టేలా, ప్రభావితం చేసేలా పోస్టులు పెట్టరాదని సూచించారు. యంత్రాంగం సోషల్ మీడియా మీద ప్రత్యేక నిఘా పెడుతుందన్నారు. తాత్కాలికంగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు.

ఈవీఎం కేంద్రం పరిశీలన..

కామారెడ్డిలోని ఈవీఎం కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు సందర్శించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలించారు.

ప్రత్యేక విభాగాలలో..



ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, కంట్రోల్ రూంలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం పరిశీలించారు. విధులు, బాధ్యతలను అధికారులకు వివరించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కోడ్ కూసె.. ముసుగు తొడిగె..



జిల్లా కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చర్యలు చేపట్టారు. జిల్లాకేంద్రంలో బల్దియా అధికారులు రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు వేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న వైఎస్‌ఆర్, ఎన్టీఆర్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఆయా పార్టీల ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను తొలగించారు. ఎలక్షన్ కోడ్ అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు.



ఇందిరా చౌక్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి ముసుగు





జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

'బీఆర్‌ఎస్ నేతల గూండాగిరీ'



తుజాల్‌పూర్‌లో బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

బీబీపేట: బీఆర్‌ఎస్ నాయకులు గూండాల్లా వ్యవహరిస్తూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. ఇటీవల దళితబంధు పథకం విషయంలో బీఆర్‌ఎస్ నాయకులకు, దళితులకు మధ్య జరిగిన ఘర్షణలో తుజాల్‌పూర్, శేరిబీబీపేట గ్రామాలకు చెందిన ముగ్గురు దళితులు గాయపడ్డారు. వారిని మంగళవారం షబ్బీర్ అలీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీవారికే అందుతున్నాయన్నారు. ప్రజల సొమ్ము బీఆర్‌ఎస్ పార్టీ వారికే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దళితులను చిన్నచూపు చూసేలా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. దళితుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుతారి రమేష్, నాయకులు భూమాగౌడ్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



బాన్సువాడ రూరల్: దివ్యాంగ విద్యార్థులను, వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా ఆదరించాలని కామారెడ్డి డీఈవో రాజు కోరారు. మంగళవారం ఆయన బాన్సువాడలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. ప్రతివారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటపాటలతో కూడిన ప్రత్యేక విద్య అందిస్తున్నారన్నారు. అధికారులు శ్రీపతి, ఐఈఆర్పీలు వసంత్, పద్మ ఉన్నారు.

బస్సాపూర్ గౌడ సంఘం నూతన కార్యవర్గం



భిక్కనూరు: మండలంలోని బస్సాపూర్ గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసాల సత్యాగౌడ్, కార్యవర్గ సభ్యులుగా కాసాల నర్సాగౌడ్, గంగాగౌడ్, సుదర్శన్ గౌడ్, రామగౌడ్, నర్సాగౌడ్, యువజన సంఘం ప్రతినిధులుగా ప్రశాంత్ గౌడ్, సతీష్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం వీరందరూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మొరం.. అక్రమార్కులకు వరం

- రెవెన్యూ, ఎస్సారెస్పీ ప్రాజెక్టు అధికారుల మధ్య లోపించిన సమన్వయం
- అవకాశంగా మలుచుకుంటున్న వ్యాపారులు
- జోరుగా వరద కాలువ నుంచి తవ్వకాలు



బోదేపల్లి శివారులో వరద కాలువ నుంచి టిప్పర్లతో తరలిస్తున్న మొరం

బాల్కొండ: రెండు శాఖల మధ్య లోపించిన సమన్వయంతో వ్యాపారులు తమ అవకాశంగా మలుచుకొని నిబంధనలకు విరుద్ధంగా మొరాన్ని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నారు. ఎస్సారెస్పీ, రెవెన్యూ అధికారుల మధ్య నెలకొన్న కోల్డ్‌వార్‌తో వ్యాపారులు ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువ కట్ట నుంచి నామమాత్రపు డీడీలు చెల్లించి నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లతో మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల మత్తుతో వారి వ్యాపారం జోరుగా సాగుతోంది. భవిష్యత్‌లో వరద కాలువకు ఎక్కడైన గండి ఏర్పడితే పూడ్చేందుకు మొరం లేకుండా పోతోంది. ఫలితంగా ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. అసలు వరద కాలువ నుంచి మొరం తవ్వకాలు చేపట్టేందుకు ప్రాజెక్ట్ అధికారులు అనుమతివ్వాలి. వ్యాపారులు క్యూబిక్ మీటర్‌కు రూ. 133 ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించి, ప్రాజెక్ట్ అధికారుల పర్యవేక్షణలో మొరం తవ్వకాలు చేపట్టాలి. కానీ ఇక్కడ ఇదందా ఏమీ కనిపించడం లేదు. రెవెన్యూ, ప్రాజెక్ట్ అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని అవకాశంగా మలుచుకుని మొరం దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. నామ మాత్రంగా డీడీ చెల్లించి రోజంతా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. వరద కాలువ కట్ట నుంచి మొరం తరలిస్తే కట్ట పరిస్థితి ఏంటని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలు ఎవరి ఆధీనంలో..

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి, మిగులుజలాలను సద్వినియోగపర్చేందుకు నిర్మించిన వరద కాలువ ప్రాజెక్ట్ అధికారుల ఆధీనంలో ఉంది. వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు ప్రాజెక్ట్ అధికారులు అనుమతివ్వాలి. కానీ కొంత కాలంగా రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు అనుమతులు ఇస్తున్నారు. దీనికి గతంలో కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన నారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే ప్రాజెక్టు ఆధీనంలో ఉన్న వరద కాలువ నుంచి రెవెన్యూ అధికారులు మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చేది లేదని వారు పేర్కొంటున్నారు. దీంతో ఈ రెండు శాఖల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. దీన్ని తమ అవకాశంగా మలుచుకున్న మొరం వ్యాపారులు ఒక శాఖకు, మరో శాఖ అనుమతిచ్చింది ఇచ్చిందంటూ యథేచ్ఛగా మొరంగా తరలిస్తున్నారు.

గుట్టలనూ తోడేస్తున్నారు..

బాల్కొండ మండల కేంద్రంలో సమీకృత హాస్టల్ భవనం వెనుక, కేజీబీవీ పాఠశాల పక్కన ఉన్న గుట్టలను మొరం వ్యాపారులు తేడోస్తున్నారు. ప్రస్తుతం వీరి కన్ను వరద కాలువపై పడడంతో మొరం వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గుట్టలను ఖాళీ చేశారు. ఇప్పుడు ప్రాజెక్ట్ అధికారుల కళ్లు గప్పి రెవెన్యూ అధికారులు అనుతిస్తున్నారంటూ వరద కాలువను సైతం ఖాళీ చేస్తున్నారు. మండల కేంద్రంలో అక్రమార్కులు గుట్టలను తవ్వేసినా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వారికి అందాల్సిన ముడుపులు అందాయనేది తేటతెల్లమవుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రాజెక్టు అధికారులకే అధికారం

వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతివ్వడానికి లేదు. మొరం అక్రమంగా తరలిస్తే సీజ్ చేసే అధికారం మాకు ఉంది. కానీ రెవెన్యూ అధికారులు అనుమతిచ్చి విక్రయిస్తున్నారు. గతంలో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ కాపీని చూయించాలని రెవెన్యూ అధికారులను పలుమార్లు కోరాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

నిబంధనల మేరకే..

వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు రెవెన్యూ శాఖకే అనుమతి ఉంది. నిబంధనల ప్రకారం డీడీ రూపంలో చలాన్ చెల్లించిన తరువాతే అనుమతిస్తున్నాం. నిబంధనల ప్రకారమే వరద కాలువ నుంచి మొరం తవ్వకాలకు అనుమతిస్తున్నాం. తవ్వకాల్లో మోసం జరిగినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, తహసీల్దార్, బాల్కొండ

కోరుట్ల బరిలో 'ధర్మపురి'..!

- పసుపు బోర్డు ప్రకటనతో జోష్
- ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి హామీ?



సాక్షిప్రతినిధి,కరీంనగర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగుతారన్న ప్రచారం ఊపందుకుంది. బీజేపీ అధిష్టానం పార్లమెంట్ సభ్యులను ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తమ పరిధిలోని అసెంబ్లీ సీట్లకు పోటీ చేయాల్సిందేనని పార్టీ ఆదేశించడంతో ఎంపీలు తమకు అనుకూలమైన అసెంబ్లీ సీట్లల్లో బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గంలో సొంత సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉండటం, ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ నిజామాబాద్ బహిరంగసభలో పసుపు బోర్డును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం.. ఎన్నోఏళ్లుగా మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ, అమిత్‌షాల దృష్టికి తీసుకెళ్లానని త్వరలోనే పునః ప్రారంభింపజేస్తాననే హామీతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు సమాయత్తమవుతున్నట్లు సమాచారం. కోరుట్ల నియోజక వర్గంలో పసుపు, చెరుకు పంటలు పండించే రైతులు అత్యధికంగా ఉండటం ఎన్నికల్లో కలిసొస్తుందనే ఆశాభావంతో కోరుట్ల నుంచే పోటీ చేసేందుకే మొగ్గు చూపుతున్నట్లు వినికిడి. బీజేపీ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇప్పటికి కార్యకర్తలు, నాయకులకు కొదవలేకపోవడం కూడా పార్టీ గెలుపుణకు దోహదపడుతుందని భావించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆర్మూర్ అసెంబ్లీ సీటుకన్న కోరుట్లలో విజయం సాధించడం సులువు అవుతుందని భావిస్తున్నట్లు సమాచారం. బీజేపీ కేంద్ర కమిటీ నాయకులు పార్లమెంట్ సభ్యులంతా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్లమెంట్ పరిధిలోని ఏదోఒక అసెంబ్లీ నుంచి పోటీ చేయాల్సిందేనని స్పష్టం చేయడంతో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ నుంచి బరిలో దిగేందుకే ఎంపీ ధర్మపురి అర్వింద్ ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం..



ఈ ఆటోను చూశారా.. స్కూల్ విద్యార్థులతో కలిసి ప్రమాదకరంగా ఎలా వెళ్తుందో.. ఇది చూసినవారందరూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం తగదు ఆటో అన్నా అంటూ డ్రైవర్‌ను మందలించారు. నగరంలోని ఆర్టీసీ కాలనీలో ఓ స్కూల్‌కు చెందిన విద్యార్థులను ఇలా ప్రమాదకరంగా తీసుకెళ్తున్న దృశ్యం 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– నిజామాబాద్ అర్బన్

రిజిస్ట్రార్ యాదగిరికి సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన రిజిస్ట్రార్ యాదగిరిని అధ్యాపకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి పున్నయ్య, అధ్యాపకులు రవీందర్ రెడ్డి, పాత నాగరాజు, సంపత్, స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నాగారం : 2023–24 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ఇంటర్ పూర్తిచేసుకున్న ఏదైనా గ్రూప్ విద్యార్థినులు, మహిళలు ఏఎన్ఎం/ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) కోర్సు ల్లో భాగంగా మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సరస్వతి ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ మహేశ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 90598 88512 సంప్రదించాలన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వసంత్



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది బంటు వసంత్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా వసంత్‌కు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, సీనియర్ న్యాయవాదులు బండారి కృష్ణానంద్, ఆకుల రమేశ్, పి.రాజు, బిట్ల రవి, దాసరి పుష్పమిత్ర తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నవంబర్ 3న కైసర్ స్పోర్ట్స్ టోర్నీ

నిజామాబాద్‌నాగారం: కైసర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలను నగరంలోని రాజారాం స్టేడియంలో నవంబర్ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సయ్యద్ కైసర్ మంగళవారం తెలిపారు. అండర్–16, అండర్–19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9849283407 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్



భీమ్‌గల్: మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బడా భీమ్‌గల్ శివారులోని పెదగంటి ఎల్లమ్మ ఆలయం వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా షేక్‌శాన్, మేకల రమేశ్, సయ్యద్ హుస్సేన్, పిప్పెర రాజేశ్‌గౌడ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 600 గ్రాముల గంజాయి లభ్యమైందని దీని విలువ సుమారు రూ. 15 వేలు ఉంటుందని అన్నారు. నిజామాబాద్‌కు చెందిన యూనుస్ అనే వ్యక్తి నుంచి వీరు కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు. వీరి నుంచి నాలుగు ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీలో సిబ్బంది రాజ్‌కుమార్, రంజిత్, దయానంద్ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో గంజాయి రవాణా చేస్తున్న మహ్మద్ యూనస్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ దిలీప్ తెలిపారు. నిందితుడి నుంచి 1.2 కేజీల గంజాయి, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై మల్లేశ్, సిబ్బంది ప్రభాకర్, షబ్బీర్, సాయిశ్యాం, సంజయ్, సంగయ్య, రవి పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్‌లేని వాహనాలు పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని పలు చోట్ల నంబర్‌ప్లేట్ లేని 61 వాహనాలను పట్టుకుని జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ మంగళవారం తెలిపారు. నగరంలోని ట్రాఫిక్‌ల వద్ద సీఐ చందర్ రాథోడ్, ఆర్ఐ సతీశ్, ఎస్సైలు చంద్రశేఖర్, సుమన్ నంబర్ ప్లేట్ వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్, ధ్రువీకరణపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

ఐదుగురి బైండోవర్

మోపాల్: మండలంలోని ఐదు గ్రామాల్లో పలువురిని తహసీల్దార్ ఎదుట పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. మండలంలోని న్యాల్‌కల్, సిర్‌పూర్, మంచిప్ప, ముదక్‌పల్లి, బాడ్సి గ్రామాల్లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పలువురిని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని పద్మానగర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. వీరి నుంచి నాలుగు సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

- ప్రయాణికులకు గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజారతండా వద్ద మంగళవారం రాత్రి రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలైనట్లు ఎస్సై రాజు తెలిపారు. బంజార తండాలో బోధన్ డిపోకు చెందిన బస్ ఎదుట పశువులు అడ్డురాగా డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న మెదక్ డిపోకు చెందిన ఆర్డినరీ బస్ ఢీ కొన్నది. ఈ ఘటనలో బోధన్ బస్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు గోకునూరి సాయాగౌడ్, మెదక్ బస్‌లో ప్రయాణిస్తున్న చాకలి విఠల్‌కు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రాజు ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుల వివరాలను సేకరించారు.

రోగులపై ఇంత నిర్లక్ష్యమా..



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం తీవ్ర గాయాలైన ఓ యువకుడిని ఆసుపత్రిలోని మొదటి అంతస్తుకి తీసుకెళ్లాల్సి ఉండగా వీల్‌చైర్ లేకపోవడంతో కుటుంబీకులు చేతులపైనే మొదటి అంతస్తు వరకు తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులపై ఇంత నిర్లక్ష్యం తగదంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ఏటీఎం చోరీకి యత్నం



నిందితులు వదిలేసి వెళ్లిన మిషన్ భాగాలు, ట్రాక్టర్

వేల్పూర్: అంక్సాపూర్ గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంను దొంగలు చోరీ చేసేందుకు విఫలయత్నం చేశారు. గ్రామస్తులు నిద్రలేవడంతో నిందితులు పరారయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేసిన తర్వాత నిందితులు ఏటీఎంలో ప్రవేశించినట్లు సీసీ కెమెరాలో నమోదైంది. పాత ఇరిగేషన్ భవనం వద్ద ఉన్న జీపీ ట్రాక్టర్‌ను దొంగిలించి బ్యాంకు వద్దకు తెచ్చారు. అందులో ఏటీఎం మిషన్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. మిషన్‌ను బయటకు తీసుకొచ్చి ట్రాక్టరులో ఎక్కించే క్రమంలో ఇంజిన్‌కు, ట్రాక్టరు ట్రాలీకి మధ్య భాగంలో ఇరుక్కుంది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ ముందుభాగం లేచి కదలకుండా మారింది. ఆ శబ్దానికి చుట్టుపక్కల వారు లేచి అరవడంతో నిందితులు పరారయ్యారు. ఘటన స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ జగదీశ్, ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన పాత నేరస్తులు ఏటీఎం చోరీకి యత్నించిన దొంగలుగా గుర్తించి, వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

రుద్రూర్: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన అంబం (ఆర్) జీపీ పరిధిలోని కొండాపూర్ చెరువులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన దశరథ్(60) మరొకరితో కలిసి సోమవారం రాత్రి చేపలు పట్టేందుకు గ్రామ చెరువుకు వెళ్లారు. చేపలు పడుతుండగా దశరథ్ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి ఒకరు..

కోటగిరి (రుద్రూర్): మండల కేంద్రానికి చెందిన దేశాయ్‌పేట్ వీరేశం (40) స్థానిక దామర చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం స్నానం చేసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వీరేశం తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలిస్తుండగా మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్‌కు మంటలు



సిలిండర్‌కు అంటుకున్న మంటలు

బీబీపేట: అకస్మాత్తుగా వంట గ్యాస్‌కు మంటలు అంటుకొని చెలరేగిన మంటలకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఇల్లెందుల రాజు తన ఇంట్లో వంట చేస్తుండగా అకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్‌కు మంటలు వ్యాపించాయి. దీంతో ఇంటి పైకప్పుకు మంటలు అంటుకున్నాయి. సిలిండర్‌ను కర్ర సహాయంతో బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. చుట్టూ ఇళ్లు ఉండడం, జనాలు గుమిగూడడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. చివరికి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా అదే ఇంట్లో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచుకొని వాహనాలకు గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తాడని, దానివల్లే ప్రమాదం సంబవించినట్లు పలువురు కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య గ్యాస్ రీఫిల్లింగ్‌ను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెర్కిట్‌లో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో రుచిత అనే మహిళ మెడ నుంచి రెండున్నర తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎతుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లిలో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి స్కూటీపై వచ్చిన దుండగులు మెడలో ఉన్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు వెల్లడించారు.

ఐదు కిలోల క్లోరోహైడ్రేట్ పట్టివేత



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఐదు కిలోల క్లోరోహైడ్రేట్‌తో తిరుగుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎకై్సజ్ సీఐ రూప్‌సింగ్ మంగళవారం తెలిపారు. మండలంలోని బర్దిపూర్, కుమ్మన్‌పల్లి గ్రామాలకు చెందిన జగదీశ్‌గౌడ్, నాగేశ్‌గౌడ్, రాకాసీపేట్‌కు చెందిన శంకర్‌గౌడ్ నుంచి ఐదు కిలోల క్లోరోహైడ్రేడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురు కూలీలకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని రాంపూర్ గడ్డ తండాకు చెందిన ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు ఆటోలో పోతంగల్ శివారులో పని నిమిత్తం వెళ్తుండగా సాంకేతిక లోపంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ, కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు



బ్రాహ్మణపల్లిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎడపల్లి/ తాడ్వాయి/ ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట/ రాజంపేట/ బీబీపేట/ రామారెడ్డి/ ఖలీల్‌వాడి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గ్రామాల్లో బెల్ట్‌షాపులపై పోలీసులు సోమవారం రాత్రి, మంగళవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్, కుర్నాపల్లి గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో సుమారు రూ.41 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఠాణాకలాన్‌కు చెందిన మురళీగౌడ్, భూమాగౌడ్, కుర్నాపల్లికి చెందిన పరశురాంగౌడ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లిలో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి ఓ ఇంటిపై దాడి చేసినట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన అబ్బాగోని కిష్టాగౌడ్ తన ఇంట్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 43 వేలు ఉంటుందని అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో సత్యనారాయణ, అనసూయల వద్ద రూ. 15 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌లో బేస్త రాజు తన దుకాణంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వీటి విలువ రూ.15,513 ఉంటుందని అన్నారు. రాజంపేట మండలం బస్వన్నపల్లిలో ఓ బెల్ట్ షాపులోని మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సంపత్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని పేర్కొన్నారు. బీబీపేట మండలంలోని మాందాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడు లింగాల వెంకటస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వీటి విలువ రూ. 17,270 ఉంటుందని అన్నారు. రామారెడ్డి మండలంలోని గిద్ద గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బాలరాజుపై కేసు నమోదు చేసి రూ. 9వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. నగరంలోని ఆరో టౌన్ పీఎస్ పరిధిలోని బెల్ట్ షాపుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. నిర్వాహకుడు దీపక్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.